## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


హుజూరాబాద్ టౌన్: హనుమాన్ ఆలయంలో అర్చకుడి ఆశీర్వచనం పొందుతున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్/ రూరల్/ సైదాపూర్/ చిగురు మామిడి/ చొప్పదండి, ఏప్రిల్12: హనుమాన్ చిన్న జయంతి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లోని ఆయా హనుమాన్ ఆలయాలతో పాటు చిగురుమామిడి మండలం సుందరగిరి పాంబండలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, చొప్పదండి పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని ఆయన ఆంజనేయ స్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీధర్, సంతోష్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ విజయవంతం చేయాలి

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగల ఏకానందం పిలుపునిచ్చారు. మండలంలోని పర్లపల్లిలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలందరూ భారీగా తరలిరావాలన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు తాటిపెల్లి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ మాదడి భారతి, మాజీ ఎంపీటీసీ ముప్పిడి సంపత్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుద్దాల రాజేశ్, గ్రామ యూత్ అధ్యక్షుడు బాగోతం తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సేంద్రియ సేద్యంతో లాభదాయకం


కలెక్టరేట్, ఏప్రిల్ 12: సేంద్రియ వ్యవసాయం రైతులు, ఉత్పత్తుల కొనుగోలుదారులకు లాభదాయకమని, అన్నదాత సేవా సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో రైతులకు సేంద్రియ వ్యవసాయ సాగుపై నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గుతున్నాయని, భూసారం కూడా క్షీణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పుల పాలైన అన్నదాతలు ఆత్మహత్య చేసుకునే ఆలోచన చేస్తున్నారని, వీటన్నిటికి ప్రత్యామ్నాయమే సేంద్రియ వ్యవసాయమని పేర్కొన్నారు. పశువుల పేడ, గోమూత్రం, పుట్టమన్ను, శనగపిండి కలిపి ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేసుకుని సాగు చేసే పంటలకు వినియోగించాలని సూచించారు. సేంద్రియ సాగుతో వచ్చే దిగుబడులు ఆరోగ్యానికి మేలు చేకూర్చడంతో పాటు, భూసారాన్ని కూడా పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.వాసుదేవరెడ్డి, యాళ్ల రమణారెడ్డి, తంగెళ్ల రాజయ్య, ద్రాక్ష మల్లికార్జున్, వైద్యుల శ్రీనివాస్, కొంకటి మల్లయ్య, తక్కలపల్లి మనోహర్‌రావు, తాండ్రియాల వెంకటేశ్వర్లు, ఈసరి రఘుపతితో పాటు జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా రామారావు


తూం రామారావు

విద్యానగర్, ఏప్రిల్ 12 : తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్(1725 ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర కార్యదర్శిగా తూం రామారావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, రాష్ట్ర ఇన్‌చార్జి కామ్రేడ్ వీఎస్ బోస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అంబరాన్నంటిన స్నాతకోత్సవ సంబురం


వైద్య విద్యార్థినికి పట్టా అందజేస్తున్న కేటీఆర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సంజయ్ కల్వకుంట్ల, చల్మెడ కళాశాల చైర్మన్ లక్ష్మీనర్సింహారావు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 12: నగరంలోని బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో 2019 ఎంబీబీఎస్ బ్యాచ్ స్నాతకోత్సవ సంబురం అంబరాన్నంటింది. వందలాది మంది విద్యార్థులు, అతిథుల మధ్య అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో చదివి డాక్టర్ డిగ్రీ తీసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. వారి మాటల్లో..

### నూతన విజ్ఞానాన్ని పెంచుకున్న..



వైద్య విద్యలో అధ్యయనాలు చేసి విజ్ఞానాన్ని పెంచుకున్న. టైంతో సంబంధం లేకుండా హార్ట్‌ఫుల్‌గా డ్యూటీలు చేశా. డాక్టర్లుగా ఎదగడానికి అధ్యాపకుల సలహాలు, సూచనలతో సర్జరీలు, చికిత్సలు చేశాం. ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి అవసరమైన నాలెడ్జ్‌ను సంపాదించుకున్న. కష్టపడి చదివి ఈ రోజు పట్టా తీసుకోవడం సంతోషంగా ఉంది. *- డాక్టర్ సానియా (ఎంబీబీఎస్ డిగ్రీ పొందిన విద్యార్థి)*

### చాలెంజ్‌గా తీసుకుని సాధించా



లైఫ్‌ను చాలెంజ్‌గా తీసుకుని పట్టుబట్టి చదివి డాక్టర్‌గా విజయం సాధించా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎంతో శ్రమించి పరీక్షలు రాసి, మొదటి సంవత్సరం పూర్తి చేశా. కళాశాల ఫ్యాకల్టీ, ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్స్ సలహాలు, సూచనలతో ముందుకుసాగాం. సీనియర్స్ గైడ్స్ తీసుకుని, వైద్య పరీక్షలు చేయడం, రిస్క్రిప్షన్ రాయడం, కరోనా టైంలో మంచి విద్యను అభ్యసించి, అనునిత్యం డాక్టర్‌గా రీసెర్చ్ చేశాం.ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానం భవిష్యత్‌లో మంచి డాక్టర్లుగా ఎదిగేందుకు తోడ్పడుతుంది.

*- గంగుల జాహ్నవి (ఎంబీబీఎస్ డిగ్రీ పొందిన విద్యార్థి)*

### ఎంతో శ్రమించాం..



వైద్యులుగా డిగ్రీ పొందేందుకు ఎంతో శ్రమించాల్సి వచ్చింది. తరగతి గదుల్లో రిప్రజెంటేషన్, పరీక్షలు, స్టడీలో గ్రూప్ డిస్కర్షన్ చేశాం. అధ్యాపకులు చూపించిన విధంగా సర్జరీలు, వైద్య పరీక్షలు చేశాం. వార్డులో డ్యూటీలు, అత్యవసర సేవలపై సీనియర్ల సలహాలు తీసుకున్నాం. ఓవర్ టైమ్ వర్క్ చేసి, వైద్యులుగా అనేక మెళకువలు నేర్చుకున్నాం. వైద్యులుగా స్థిరపడబోతున్నామనే నమ్మకం కలిగింది.

*- డాక్టర్ కే సరయు (ఎంబీబీఎస్ డిగ్రీ పొందిన విద్యార్థి)*

## వైభవంగా సూర్య రథోత్సవం


పుష్పాలంకృతుడైన స్వామి వారు

ఇల్లందకుంట, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని సీతారాముల ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సూర్య రథోత్సవం వైభవంగా సాగింది. స్వామివారి ఉత్సవమూర్తులను అర్చకులు పూలతో అలకరించారు. స్వామివారు సూర్య రథం (చిన్నరథం)పై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం భక్తులు బండ్లు కట్టుకొని దేవాలయం చూట్టు తిప్పారు. కార్యక్రమాల్లో దేవాలయ చైర్మన్ రామారావు, ఈవో కందుల సుధాకర్, అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరాచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 'పారమిత' విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 12: ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపియాడ్ పోటీల్లో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి అంతర్జాతీయ ర్యాంకులు సాధించారు. శక్తికిరణ్ శెట్టి, అర్హాన్ లతీఫ్ ప్రతిభ చూపి ఆలిండియా సౌత్ జోన్ టాపర్లుగా నిలిచారని ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ తెలిపారు. వీరితో పాటు 33 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో అత్యుత్తమ ప్రతిభ చూపగా, వారిని అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 12: తమ హయాంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించాలని, మాజీ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శనివారం జిల్లాకేంద్రంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జేఏసీ జిల్లా కన్వీనర్ లక్ష్మీరాజం మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచులకు ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలన్నారు. అభివృద్ధి పనుల బిల్లులు రాక మాజీ సర్పంచుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తుండడం ఏమేరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో చర్చించారు. సమావేశంలో పలువురు మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి అల్ఫోర్స్ చైర్మన్ విరాళం


గోపాల్‌రావుపేటలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామడుగు, ఏప్రిల్12 : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో స్థానిక నేచర్ యూత్‌క్లబ్ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణం చేపట్టగా, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి. నరేందర్‌రెడ్డి శనివారం సందర్శించి రూ.2లక్షల 22వేల 222 విరాళం అందించారు. అనంతరం స్థానిక వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.

## అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 12 : జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి ప్రారంభించి, చిన్నారులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం ద్వారా వారికి పలు విషయాల్లో పట్టు వస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు ప్రోత్సాహం అందిస్తూ, అన్ని విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 12: లైన్, 33/11కేవీ సబ్ స్టేషన్ల మెయింటనెన్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్‌ల పనులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈ లు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 11.30గంటల వరకు చింతకుంటలో కొంత ప్రాంతం, శ్రీరాంనగర్, మల్కాపూర్, కమాన్ పూర్, గ్రానైట్ ఇండస్ట్రీస్, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు గణేశ్ నగర్ బైపాస్ ఏరియా, తిరుమల థియేటర్ ఏరియా, వసంత్ వాలి స్కూల్, ద్వవాసి కార్ఖానా, మాజీ ఎమ్మెల్సీ ఇంటి ప్రాంతం, జెప్టో ఏరియా, ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు శక్తి టెంపుల్, బాలాజీ సూపర్ మార్కెట్, సంతోష్ నగర్, భాగ్యనగర్, జ్యోతీనగర్, గీతాభవన్ వెనుక ప్రాంతం, కార్పెంటర్ సొసైటీ ఏరియా, సంతోష్ మాతా హనుమాన్ గుడి ప్రాంతం, న్యూ లేబర్ అడ్డా, సాయిబాబా గుడి ఏరియా, ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నగునూరు గ్రామం, వల్లంపహాడ్, తీగలగుట్ట పల్లె, ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఉజ్వల పార్క్ సబ్ స్టేషన్ వరకు (బైపాస్ ఏరియా), పాలిటెక్నిక్ కాలేజ్ ఏరియా, ఐటీ హబ్, ఐటీఐ కాలేజీ, డీ మార్ట్ ప్రాంతం, ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు కొత్తపల్లి(హెచ్), వెలిచాల, దేశరాజ్ పల్లె, వెదిర, మిషన్ భగీరథ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## వెలిమల మదన్ మోహన్ రావు కన్నుమూత

చిగురుమామిడి, ఏప్రిల్ 12: రేకొండ గ్రామంలో వందల ఎకరాల భూమిని ప్రజల కోసం ఉదారంగా దానం చేసిన వెలిమల మదన్ మోహన్ రావు (74) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని తన సోదరి ఇంటి వద్ద మృతి చెందారు. 1977లో హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అవివాహితుడైన ఆయన సంవత్సరం క్రితం వరకు గ్రామంలోనే ఉన్నారు. బీసీ కాలనీ, ఎస్సీ, వడ్డెర కాలనీ తోపాటు గ్రామపంచాయతీ భవనానికి, పాలకేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రానికి సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన సోదరిలు డాక్టర్ రత్నకుమారి, శారదా దేవి హైదరాబాద్‌లోని తమ నివాసంలోనే వైద్య సేవలందించారు. కాగా, శనివారం తెల్లవారుజామున మదన్ మోహన్ రావు మృతి చెందగా, అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలిసిన గ్రామస్తులు కంటతడి పెట్టారు. గ్రామంలోని అన్ని కుల సంఘాలతోపాటు సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, వివిధ పార్టీల నాయకులు దుడ్డేల లక్ష్మీనారాయణ, బోయిని అశోక్, చాడ శ్రీధర్ రెడ్డి, మామిడి అంజయ్య, పిట్టల రజిత, కృష్ణ మోహన్ రావు, ఇంద్రసేనా రావు, సాయిని వెంకటేశ్వర్లుతో పాటు పలువురు మదన్ మోహన్‌రావు మృతికి సంతాపం ప్రకటించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- సీరియల్స్‌కి పరిమితం కావొద్దు.. ఉపాధి మార్గాలెంచుకోవాలి
- ఈ- ఆటో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి


ఎలక్ట్రికల్ ఆటో నడుపుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 12: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మహిళలు టీవీ సీరియళ్లకు పరిమితం కాకుండా ప్రభుత్వపరంగా కల్పించే అవకాశాలతో ఉపాధి పొందాలన్నారు. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోవో సొసైటీ సహకారంతో ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయి దేశ్ ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో 20 మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ-ఆటోల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను ఆటోల్లో తీసుకెళ్లడం ద్వారా మహిళలు నికర ఆదాయం పొందగలుగుతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి మాట్లాడుతూ, ఇంతకుముందు మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్ వంటి వాటిల్లో మాత్రమే శిక్షణ ఇవ్వగా ఇప్పుడు డ్రైవింగ్ లోనూ శిక్షణ ప్రారంభించామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ఈ డ్రైవింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకొని దేశంలోని మహిళలకు కరీంనగర్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా ప్రాంగణంలో వివిధ శిక్షణలు పొందిన పలువురు మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మోవో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జై భారతి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం మేనేజర్ సుధారాణి, సీఏ శ్రీలత, జీఎం సుభద్ర, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


రామడుగులో సింగిల్‌విండో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి

రామడుగు, ఏప్రిల్ 12 : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, యాసంగి పంట కాలానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. రామడుగు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని మరో కోనసీమలా చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్‌పర్సన్ బొమ్మరవేణి తిరుమల, ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

గంగాధర, ఏప్రిల్ 12: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని కురిక్యాల సింగిల్ విండో ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీసీవో రామానుజాచారి, సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, తహసీల్దార్ అనుపమ, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, నాయకులు సత్తు కనకయ్య, కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, కర్ర విద్యాసాగర్‌రెడ్డి, అట్ల శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సన్నాహక సమావేశం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

విద్యానగర్, ఏప్రిల్ 12 : హైదరాబాద్ జలవిహార్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే మున్నూరు కాపు సన్నాహక సమావేశానికి మున్నూరు కాపులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ కోరారు. శనివారం మంకమ్మతోట లోని మీకోసం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కులగణనలో మున్నూరు కాపులకు జరిగిన అన్యాయంపై సమష్టిగా పోరాటం చేయాలని నిర్ణయించి, మున్నూరు కాపు సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మేలో జరిగే మున్నూరు కాపు గర్జన విజయవంతానికి పోస్టర్ ఆవిష్కరించడంతోపాటు, భవిష్యత్ కార్యక్రమాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెరకొండ సంతోష పటేల్, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు వొంటేల రత్నాకర్, రాష్ట్ర కార్యదర్శి కొప్పుల అజయ్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, జిల్లా సమన్వయకర్త బొల్లం లింగమూర్తి, మంకమ్మ తోట మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ముప్పిడి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## వాగేశ్వరి కళాశాలలో అట్టహాసంగా ఫుడ్ ఫెస్టివల్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 12 : జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ పీజీ కళాశాలలో తెలంగాణ రుచులతో ఫుడ్ ఫెస్టివల్ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, వీసీ ఓఎస్డీ డాక్టర్ హరికాంత్ హాజరై కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రస్తుతం ఫుడ్ సైన్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని తెలిపారు. దశాబ్దాల క్రితం ఆహారం అంతా సహజమైనది కావడం వల్ల డాక్టర్ల అవసరం తక్కువగా ఉండేదని, కానీ ఈ రోజు కాలుష్య, ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల అనారోగ్య సమస్యలు అధికం అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫుడ్ సైన్స్ విద్యార్థులు ప్రతి ఒక్కరికి మంచి ఆహారపు అలవాట్లు తెలిసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ రత్నగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ సతీశ్ గౌడ్, విభాగాధిపతులు లింగమూర్తి, వెంకట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, రమణ, ప్రసాద్, ఏవో నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన సైన్స్ కళాశాలలో రంగోలి, క్విజ్ పోటీలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 12: మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శాతవాహన విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలో శనివారం రంగోలి పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. సైన్స్ కళాశాల సెమినార్ హాల్లో క్విజ్ పోటీలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యూ ఉమేశ్ కుమార్ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తితో కలిసి ప్రారంభించారు. బాబూ జగ్జీవన్ రామ్, జ్యోతిబాపూలే, బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో నెలకొన్న అసమానతలను రూపు మాపేందుకు, బహుజన అభివృద్ధికి విశేష కృషి చేసిన మహాత్ములను మనం స్మరించుకోవడమే వారికిచ్చే గౌరవమన్నారు. వారి ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సవాల కన్వీనర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జార్జిరెడ్డి సభను జయప్రదం చేయండి

జమ్మికుంట, ఏప్రిల్ 12: ఈ నెల 14న హైదరాబాద్ ఠాగూర్ ఆడిటోరియంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని, సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాడి రాణాప్రతాప్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన జమ్మికుంటకు వచ్చారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల బాలికల వసతి గృహంలో జార్జిరెడ్డికి నివాళులర్పించారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగుతామని, విద్యార్థుల సమస్యలపై పోరాడుతామని స్పష్టం చేశారు. ఇక్కడ జిల్లా ఉపాధ్యక్షుడు రవితేజ, నాయకులు బాబు, ఎండీ అస్లాం, శ్రీజ, అనూష, స్వప్న, రవళి తదితరులున్నారు.


## 'రాజీవ్ యువ వికాసం' గడువు పొడిగించాలి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 12: రాజీవ్ యువజన వికాసం పథకం దరఖాస్తు గడువు పొడిగించాలని బీఆర్ఎస్ పార్టీ 30వ వార్డు అధ్యక్షుడు కేసరి మధుకర్ రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు రేషన్ కార్డు, లేదంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం అడుగుతున్నారని, ధ్రువీకరణ పత్రం లేని వారు ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదని తెలిపారు. మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో మూడు రోజులుగా సర్వర్ పనిచేయక దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారని, ఈ నెల 14వ తేదీ వరకు ఉన్న గడువును మరోసారి పొడిగించి నిరుద్యోగులు లబ్ధిపొందేలా చూడాలని కోరారు.

## ఇసుక ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం

వీణవంక, ఏప్రిల్ 12: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలో బోల్తాపడగా డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని చల్లూరు మానేరువాగు నుంచి అదే గ్రామానికి చెందిన మహేశ్ ఇసుక అక్రమంగా తరలిస్తుండగా గ్రామ శివారులో వాహనం వేగంగా వెళ్తూ అదుపుతప్పి పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడగా డ్రైవర్ మహేశ్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు అతివేగంగా వెళ్తుండడంతో ఇంతకు ముందు ఎన్నో ప్రమాదాలు జరిగాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్వర్ సమస్యతో ఇబ్బందులు


గంగాధర: సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి వచ్చిన నిరుద్యోగులు

గంగాధర/మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 12: గంగాధర, మానకొండూర్ తహసీల్ కార్యాలయాల్లో సర్వర్ తరచూ మొరాయిస్తుండడంతో కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కింద యువతకు సబ్సిడీ లోన్‌ను అందిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ సరిఫికెట్లు అవసరమని చెప్పడంతో వేల సంఖ్యలో నిరుద్యోగులు కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రాల్లో అప్లై చేసుకుంటున్నారు. దీంతో ఒకే సారి వందల సంఖ్యలో దరఖాస్తులు తహసీల్ కార్యాలయాలకు చేరుకోవడంతో సర్వర్ మొరాయిస్తున్నదని కార్యాలయ సిబ్బంది తెలిపారు. సర్వర్ పని చేసిన సమయంలో సాధ్యమైనన్ని సర్టిఫికెట్లు అప్రూవ్ చేస్తున్నట్లు చెప్పారు.

## ముగిసిన ఫ్లెక్సీ వివాదం

గంగాధర, ఏప్రిల్ 12 : మండలంలో గత రెండు రోజులుగా సాగుతున్న ఫ్లెక్సీ వివాదం ముగిసింది. రెండు రోజుల క్రితం మండలంలోని మధురానగర్ గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి ఫొటోతో కూడిన గట్టుభూత్కూర్ మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి ఏర్పాటు చేయగా స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు దానిని తొలగించారు. దీంతో ఆగ్రహించిన కొత్త జయపాల్‌రెడ్డి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఫ్లెక్సీని తొలగించి విషయం గురించి అధికారులను నిలదీశారు. కాగా, శనివారం తొలగించిన ఫ్లెక్సీ స్థానంలో కొత్త ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో తాత్కాలికంగా వివాదం ముగిసిందని జయపాల్‌రెడ్డి మిత్రమండల సభ్యులు తెలిపారు.

## నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

రామడుగు, ఏప్రిల్ 12 : గోపాల్‌రావుపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సంజీవని హాస్పిటల్ యాజమాన్యం సూచించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగే ఈ శిబిరంలో వైద్య పరీక్షలను నిర్వహించి, మందులు కూడా అందించనున్నట్లు తెలిపింది.

## 18, 19 తేదీల్లో ఆహ్వానిత హాకీ టోర్నమెంట్

కొత్తపల్లి, ఏప్రిల్ 12 : జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 18,19 తేదీల్లో 5ఏ సైడ్ ఓపెన్ ఆహ్వానిత హాకీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ సంఘం అఫీషియేటింగ్ కార్యదర్శి మహమ్మద్ తారిక్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లా హాకీ సంఘం సౌజన్యంతో హమీద్ 11 హాకీ, ఫిట్‌నెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో జిల్లాలోని హాకీ క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 15లోగా పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెల్ నంబర్‌లో 7075667465 సంప్రదించాలని సూచించారు.

## కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలి

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 12: ప్రభుత్వం తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి కోరారు. పోలంపల్లిలో రైతులు రోడ్లపై ఆరబోసి ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్న వడ్లను శనివారం పరిశీలించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దళారుల దోపిడిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ముత్త స్వామి, నాయకులు అయిలయ్య, మల్లయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE



★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337576

VEHICLE FOR SALE
★ Vehicle for Sale: MARUTI ALTO VXI BS VI, Petrol Vehicle Modal: 2022 NO: TS02FH8553 Contact: Indusind Bank Cell: 9542582921
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189